తేది ——
గ్రామ పంచా...

# దేశం ఏమయ్యేటట్టు?

" విన్నావటోయ్," అన్నాడు వెంకట్రావు గబగబా పరుగెత్తుకుంటూ వచ్చి.

రామారావు అప్పుడే జపాన్ మిత్రమండలిమీద యుద్ధం ప్రకటించిందనీ, మిత్రమండలికి చాలానష్టం కలిగిందనీ విన్నాడు. వెంకట్రావు ఆ సంగతే చెబుతున్నాడనుకొని - "జపాన్ సంగతేనా?" అన్నాడు.

"జపాన్ సంగతి ఇప్పు డెరివకి కావలసి వచ్చిందోయ్! మన ఆచార్యుల సంగతి——"

" ఏం?, ఏమయింది ? "

" మన ఆచార్యుల్ని మరి కొందర్ని పోలీసులు అరెస్టు చేశారు."

" ఎందుకు? సత్యాగ్రహమేనా ? "

" సత్యాగ్రహం కాదు, పాడూకాదు," అన్నాడు వెంకట్రావు. " వాళ్ళంతా రోడ్డుకి అడ్డంగానిలబడి, ట్రాఫిక్ ఆపి పోట్లాడుకుంటూవుంటే, పోలీసులు సర్దలేక బలవంతంగా లాక్కు-పోయిజైల్లో పారవేశారాట !"

రామారావుకి ఆశ్చర్యం వేసింది. ఆచార్యులవంటి గొప్పరాజకీయవేత్త, గాంధీ శంఖారావం చెవులో పడ్డప్పటినుంచీ జైలుకి వెళ్తూవస్తూవున్న త్యాగధనుడు, ఎందుకు రోడ్డుమీదపోట్లాడు

కొని జైలుకి వెళ్ళవలసి వచ్చిందో అతనికి అర్థంకాలేదు. అందులో ఈ సమయంలోనా? పరదేశాన్నుంచిమనల్ని రక్షిం చవలసిన బాధ్యత రాజకీయవేత్తల భుజస్కంధాల మీద -మెదడు మీద అయితే బాగుండేది-ఉంది. ప్రజలంతా ఏకమై, ప్రజలంతా ఒక్కటిగా లేచి, శత్రుని ఏకోన్ముఖం చేస్తేగాని మనకు దారిలేదు. లేకపోతే ఒకముళ్ళ తోడుక్కి బదులు,మరో ముళ్ళ తోడుగు తగులుకునే అవకాశం కనిపిస్తూ వుంది.

"దెబ్బలాటేం ఖర్మం! మిగిలిన వాళ్ళెవ్వరు?"అని అడిగాడు రామారావు.

"ఏమో, నాకింకా పర్టిక్యులర్స్ తెలియవు," అని చెప్పి వెళ్ళిపోయాడు వెంకట్రావు.

రామారావుకి ఏమీ తోచలేదు. ఆలోచించాడు— పిచ్చి పిచ్చిగా వుంది. లేచి అటూ ఇటూ తిరిగాడు— జైలుకి వెళ్ళి సంగతి సందర్భాలు తెలుసుకోవాలని బయల్దేరాడు.

ఊరికి మైలుదూరంలో వుంది జైలు. అది ప్రభుత్వానికి జైలు—దొంగలకు ఖైదు—సత్యాగ్రహులకు శ్రీకృష్ణ జన్మ స్థానం. ఊరికి దూరంగా, జనసమ్మర్దనం లేకుండా, నిశ్శబ్దంగా వుంటేగాని ఖైదీలకూ, శ్రీకృష్ణజన్మస్థానవాసులకూ, హృదయ పరివర్తనం కలగదని ప్రభుత్వం ఉద్దేశం. కాని క్రియలోమాత్రం

హృదయ పరివర్తనం కలగటానికి బదులు మెదడుతిరగబడుతూ వుంటుంది.

రామారావు అధికార్ల దగ్గర పర్మిషన్ తీసుకొని జైలుప్రవేశించాడు. అనేక గదులు దాటి, అనేక రకాల మనుష్యుల్ని దాటి, నెం. 24 సెల్ దగ్గరకు జేరాడు.ఆ సెల్లో,ఆచార్యులూ, ఒక కాంగ్రెస్ సోషలిస్టూ, ఒక కిసాన్ సభైటూ,ఒక కమ్యూనిస్టూ, ఒక రాయిస్టూ వున్నారు.

ఆచార్యులు ఒక మూలకూర్చొని తకిలీ వాడుకుతున్నాడు. కాంగ్రెస్ సోషలిష్టు తల కాళ్ళసందున ఇరికించుకొని కూర్చున్నాడు. కిసాన్ సభైట్ చువ్వల్లోనుంచి దిక్కులు చూస్తూనుంచున్నాడు. కమ్యూనిస్టుఆవేశంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు. రాయిస్టు ఎవరికీ సంబంధం లేకుండా ఒకమూల కూర్చొని పుస్తకం చదువుకుంటున్నాడు.

అటూ ఇటూ తిరుగుతున్న కమ్యూనిష్టు గబగబా ఆచార్యుల మీద మీదకువెళ్ళి—"తకిలీ వాడికి దేశం తాడు పుటిక్కిన తెంపావ్! ఇకన్నా మానుకుంటావా, లేదా?"అన్నాడు.

కాంగ్రెస్ సోషలిష్టు కాళ్ళసందునుంచి తల పైకెత్తి విచారంగా చూశాడు.

కిసాన్ సభైట్, "ప్రజలు మెచ్చుకుంటారని పైటచేస్తే చేశావ్ ! జైల్లోకూడా ఎందుకయ్యా ఈపాడుపని?" అన్నాడు.

రాయిస్టు, "తాత్విక విప్లవం రావాలి. మాటలవల్ల ప్రయోజనం లేదు," అన్నాడు.

ఆచార్యులవారు మాత్రం వీళ్ళమాటలు లెక్క చెయ్యకుండా తకిలీ వాడుకుతూనే వున్నాడు. రామారావు నెమ్మదిగా ఆచార్యుల దగ్గరకువెళ్ళి; "ఆచార్యులూ?" అని పిలిచాడు.

ఆచార్యులు రామారావు గొంతు విని ఉలిక్కి పడ్డాడు- తకిలీ ఆపేశాడు.

"ఏమిటిదంతా?" అని అడిగాడు రామారావు.

"అంతా నడమంత్రమోయ్! మనం ఇన్ని సంవత్సరాల నుంచీ దేశంకోసం ప్రాణాలనుకూడా లెక్క చెయ్యకుండా పోట్లాడుతున్నామా? ఇప్పుడు వీళ్ళు— ఈ కుర్రకుంకలు— నాకళ్ళ ముందు పుట్టిన వీళ్ళు —నన్ను తకిలీ మానివెయ్యమంటారా? మానకపోతే నన్ను ఫేసిస్టు అంటారా?" అన్నాడు.

ఈ మాటలు విని మిగిలినవాళ్ళంతా రంయిన ఆచార్యుల చుట్టూ పోగయ్యారు.

"మానకపోతే నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు కమ్యూనిస్టు.

"మామాట వినకపోతే నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

## దేశం ఏమయ్యేటట్టు ?

"నువ్వు పెద్ద పెత్తందారువి. పెత్తనం మా రైతుకూలీ ప్రతినిధులకు వొదిలేవరకూ నువ్వు ఫేసిస్టువే," అన్నాడు కిసాన్ సభైట్.

"తకిలీ మానినా మానకపోయినా వర్గసంబంధాలనుబట్టి నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు రాయిస్టు—"నీ భగవద్గీతా, నీ వేదాలూ, నీ ఆధ్యాత్మిక నాగరికతా అంతా ఫేసిస్టుమయం"

"అవును," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

రామారావుకి అంతా అయోమయం అయింది— "మీ రెవరండీ?" అని అడిగాడు.

"నేను కాంగ్రెస్ సోషలిస్టుని," అన్నాడు అతను.

మిగిలిన నలుగురూ పక్కున నవ్వారు. ఆచార్యులు పెద్ద మనిషి తరహా కాదనుకొని నవ్వు ఆపుకోటానికి ప్రయత్నించాడు. కిసాన్ సభైట్ కోరచూపులు చూస్తూ నవ్వాడు. కమ్యూనిస్టు గంతులు వేస్తూ నవ్వాడు. రాయిస్టు సంతోషం పట్టలేక ఒక కాగితం తిరగవేశాడు.

కాంగ్రెస్ సోషలిస్టుకి ఉక్రోషం వచ్చింది. బుంగమూతి పెట్టుకొని, "మీ రెప్పుడూ ఇంతే! నేనం టేచాలు, మీ రంతా ఏకమవుతారు," అన్నాడు.

"ఏదో పిల్ల పార్టీలో వుంటామంటే ఉండనిచ్చాం" అన్నాడు ఆచార్యులు రామారావుతో.

## దేశం ఏమయ్యేటట్టు ?

"సగం సాలినేతా సగం మాలనేతా?" అన్నాడు కిసాన్ సభైట్.

"రిఫార్మిజం!రిఫార్మిజం!!"అని కేకలువేశాడు కమ్యూనిస్టు.

"కాంగ్రెస్సో!సోషలిజమో. అంతేగాని కాంగ్రెస్ సోషలిజం ఏమిటి?ఉన్న అవక తవకలంతా పేర్లోనేవుంది. ఈపేరుపెట్టటం ఎన్ని పొరపాట్లో లెక్కవేసుకోండి చెబుతాను—

1 తంత్రరీత్యా పొరపాటు.

2 రాజకీయరీత్యా పొరపాటు.

3 సిద్ధాంతరీత్యా పొరపాటు.

మేం మొదటి నుంచీ ఈపార్టీ తీవ్రవాదుల్ని మోసంచేస్తుందని చెప్పాం. మీరు విన్నారా?" అన్నాడు రాయిస్టు.

"మేం చెప్పాం. మీరెప్పుడూ చెప్పలేదు," అన్నాడు కమ్యూనిస్టు.

"మీరు మమ్మల్ని ప్రోత్సాహపరిచి, మాతో కలిసి పని చేసి, ఇప్పు డిలా అంటున్నారా?" అని జాలిగా ప్రశ్నించాడు కాంగ్రెస్ సోషలిస్టు, కమ్యూనిస్టుని.

"అధికారం స్వాధీనం చేసుకోటానికి అలా నటించాం," అన్నాడు కమ్యూనిస్టు.

"నిజం చెప్పాలంటే మొదటినుంచీ మేం చెబుతున్నాం. ఈ దేశంలో కూలీ రాజ్యం కుదరదనీ, రైతుకూలీ రాజ్యంకావా

లనీ మేం మొదటినుంచీ మొత్తుకుంటూవుంటే మీరు మా మాట విన్నారా?" అన్నాడు కిసాన్ సభైట్.

"మీ రెవరండీ?" అని అడిగాడు రామారావు.

"మేం కిసాన్ సభవాళ్ళం"

"పెటీ బూర్జువాలు. సోషలిజం వొప్పుకోండయ్యా అంటే వినరు,"అన్నాడు కమ్యూనిస్టు.

"నిన్నటిదాకా మాలో పనిచేసి—" అని ఏదో అనబోయాడు కిసాన్ సభైట్.

"అధికారంకోసం... అధికారంకోసం"అన్నాడుకమ్యూనిస్టు.

"నిజానికి మా పార్టీ ఒక టుంటే వీళ్ళకి మరొక పార్టీ ఎందుకు చెప్పండి కాంగ్రెస్‌లో"అన్నాడు కాంగ్రెస్‌సోషలిస్టు.

రాయిస్టు అందుకున్నాడు—"కాంగ్రెస్ ఉండగా కిసాన్ పార్టీ పెట్టటం ఎన్ని తప్పులో చెబుతాను లెక్క వేసుకోండి—

1 పిష్టపేషణం.

2 పోటీసంస్థ అవటం.

3 స్వాతంత్ర్య సంఘు సందోహం అవటం.

కాంగ్రెస్ ఉండగా మళ్లీ కిసాన్ ఎందుకూ? కాంగ్రెస్ ప్రజాస్వామిక విప్లవానికి సిద్ధంగా వుంది. రైతూ ప్రజాస్వామిక విప్లవమే చేస్తాడు."

## దేశం ఏమయ్యేటట్టు ?

"అయితే కాంగ్రెస్ విప్లవసంస్థ అని ఒప్పుకుంటారా"? అని ఆదుర్దాగా ఆశగా అడిగాడు ఆచార్యులు.

"ఆఁ, కాంగ్రెస్ విప్లవసంస్థే! కాని నాయకత్వం ప్రత్యాఘాతకం," అన్నాడు రాయిస్టు.

"మరి మీరు కాంగ్రెస్‌లో'నుంచి వెళ్ళిపోయారే," అన్నాడు ఆచార్లు.

"తీవ్రవాదులు మా మాటలు వినలేదు. అందువల్ల పద్ధతి మార్చవలసి వచ్చింది."

"పద్ధతా? పతకమా?" అన్నాడు కా. సో.

"వాళ్లకు రెండూ ఒకటే," అన్నాడు కిసాన్.

"రోజు కొకపార్టీ—గడియ కొక పతకం," అని కేకలు వేశాడు, కమ్యూనిస్టు.

"మీ రెవరండీ?" అని అడిగాడు రామారావు.

"మేం కమ్యూనిస్టులం. మూడో అంతర్జాతీయ శాఖ వారం..."

"అదంతా రష్యా సాంప్రదాయం! బొత్తిగా విదేశీయం," అన్నాడు ఆచార్యులు.

"అవును ఇక్కడి పరిస్థితులు తెలియవు. సిసలైన సోషలిజం మాది. దేశవాళీసరుకు," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

## దేశం ఏమయ్యేటట్టు?

"ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే పక్వాని కొచ్చే సోషలిస్టులం మేం," అన్నాడు కిసాన్ సభైట్. "వీళ్ల కమ్యూ నిజం కొత్త పెత్తందారీతనం."

"వీళ్ళింకా బొడ్డు ఊడని కమ్యూనిస్టులు. వీళ్లని మేం ఇండియన్ కమ్యూనిస్టులు అంటాం. వీళ్ళు తెలుసుకోలేని ఫేసిస్టులు," అన్నాడు రాయిస్టు.

"మీ రెవరండీ?" అని అడిగాడు రామారావు.

"మేం రాయిస్టులం"

"రెనగేడ్స్," అని మొదలు పెట్టాడు కమ్యూనిస్టు. కోపంతో, ఆవేగంతో అతని కళ్ళు ఎర్రబడినై. "వీళ్ల నాయకుణ్ణి మేం అంతర్జాతీయ పార్టీనుంచి వెళ్లగొట్టాం. వీళ్ళనాయకుడు చైనాలో ఏమిటో చేశాడు. వీళ్ల నాయకుడికి ఇంగ్లీషు గ్రామరు రాదు."

"రైటో, రైటో!! మా పార్టీలో జేరతానని, మాకు ప్రణాళిక వ్రాసి ఇచ్చి, జేరకుండా మమ్మల్ని మోసంచేసి తర్వాత మామీదే దుమ్మెత్తి పోశాడు," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"నిజం, నిజం. మమ్మల్నీ అలాగే చేశాడు. కాంగ్రెస్లో మరో పార్టీ వుండగూడదని చెప్పి చెప్పి తానే మరోపార్టీ పెట్టాడు," అన్నాడు కిసాన్సభైట్.

## దేశం ఏమయ్యేటట్టు ?

"అంతా కాంగ్రెస్లో చేరి కాంగ్రెస్ని బలపరచమని చెప్పి చెప్పి తాను బయటికొచ్చి మరో పార్టీ పెట్టాడు," అన్నాడు కమ్యూనిస్టు.

"ద్రోహి, ద్రోహి, ద్రోహి," అని కేకలు.

"మీరంతే! పరిస్థితుల్నిబట్టి పద్ధతులు మార్చుకోవటం మీకు చేతగాదు. మేము చెప్పినట్లుచేస్తే బాగానేవుండేది. మీరు నేను చెప్పినట్లుచెయ్యరు. చెయ్యకపోవటంవల్ల మేము పద్ధతిని మార్చుకుంటే మీకు అర్థంకాదు. యుద్ధం వచ్చింది. ఫేసిజం వస్తూవుంది. మనం మారాలి..."

"ఏం ఫేసిజం వస్తే!" అన్నాడు ఆచార్యులు.

"ఫేసిజం ఇంపీరియలిజం కంటే ఘోరమైంది," అన్నాడు రాయిస్టు.

"అనేది ఒప్పుకుంటాను," అన్నాడు కమ్యూనిస్టు.

"నిజమే!" అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"మేం ఫేసిస్టు వ్యతిరేకతీర్మానంచేశాం,"అన్నాడుసన్నాటేట్.

"ఆచార్యులవారు ఇంగ్లండు గెలవ వలసిందే గాని మేం సహాయం చెయ్యం అంటారు. గెలవవలసిన దానికి సహాయం చెయ్యకపోవటం బుద్ధి జాడ్యం—"అన్నాడు రాయిస్టు.

"అది తప్పే!" అన్నాడు కమ్యూనిస్టు.

## దేశం ఏమయ్యేటట్టు?

"ఈ కమ్యూనిస్టులు ఇంగ్లండు రష్యాకి సహాయంచెయ్యాలి గాని మేం ఇంగ్లండుకి సహాయం చెయ్యం అంటారు."

"అది తప్పే" అన్నాడు ఆచార్యులు.

"కానే కాదు," అన్నాడు కమ్యూనిస్టు.

"కాకపోవచ్చు," అన్నాడు కా. సో.

"కాదు," అన్నాడు కిసాన్ సభైట్.

"ఇవి రెండుయుద్ధాలు. రెండు యుద్ధాలు. ఇంగ్లండుకీ జర్మనీకి జరిగేయుద్ధంఒకటి. రష్యాకీ జర్మనీకీ జరిగేయుద్ధం ఒకటి" అన్నాడు కమ్యూనిస్టు

"ఓ! ఏమిమార్క్సిజం"

అని ఆశ్చర్యపోయాడు రాయిస్టు

"ఈయన ఊరకే ఇంగ్లండుకి సహాయం చెయ్యమంటాడండీ. ...జవహరలాల్ మీవాడే గదా..." అని మొదలుపెట్టాడు ఆచార్యులు.

"కాదు"

"కాదు"

"కాదు"

కాంగ్రెస్ సోషలిస్టు అనుమానిస్తూ వూరుకున్నాడు.

"పోనీ ఆయన ఎంత బాగా చెప్పాడో చూడండి—"

"చూడం"

"చూడం"

"చూడం"

"ఓ బ్రిటిష్ ఇంపీరియలిజమూ నువ్వు వెళ్ళి పో, అన్నాడు జవహరలాల్" అని చెప్పాడు ఆచార్యులు.

రాయిస్టూ, కిసాన్ సభైటూ, కమ్యూనిస్టూ బిగ్గరగా నవ్వుతారు.

"ఇంపీరియలిజం పొమ్మంటే పోతుందా?" అన్నాడు కమ్యూనిస్టు.

"మనల్ని అడిగి వొచ్చిందా మనం పొమ్మంటే పోటానికి?" అన్నాడు కిసాన్ సభైట్.

"పోకపోతే ఏంచెయ్యాలో చెప్పాలి," అన్నాడు రాయిస్టు.

"నువ్వు చెబుతావా?" అని అడిగాడు ఆచార్యులు.

"ఓ చెపుతావినండి" అన్నాడు, రాయిస్టు.

"అక్కర్లేదు. నువ్వు ఇంపీరియలిస్టు ఏజంటువి," అన్నాడు కమ్యూనిస్టు.

"అవును. చెప్పక్కర్లేదు," అన్నాడు కిసాన్ సభైట్.

"అయ్యా రాయిస్టులమాటలు నమ్మకండి. వాళ్ళు స్వామి ద్రోహులు," అన్నాడు ఆచార్యులు.

"అవును ద్రోహులు," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"ఎన్ని పార్టీలు మారారో కనుక్కోండి," అన్నాడు కమ్యూనిస్టు.

"ఆ విషయంలో వీరు మరీ గొప్పవారండీ," అని కమ్యూనిస్టుని చూపించాడు ఆచార్యులు.

"ఓరీ ఫేసిస్టూ!...మేం అధికారం స్వాధీనం చేసుకోడానికి అలాంటి పనులు చేస్తాం," అన్నాడు కమ్యూనిస్టు.

"మీ యిద్దరూ ఫేసిస్టులే," అన్నాడు కిసాన్.

మీరు "ముగ్గురూ ఫేసిస్టులే," న్నాడు రాయిస్టు.

"ఇక ఫేసిస్టు కాంది ఎవరు?" అని అడిగాడు రామారావు.

"నేను"

"నేను"

"నేను"

"నేను"

"నేను"

"ఇక ఫేసిస్టు ఎవరు ?" అని ప్రశ్నించాడు రామారావు.

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

ఈ కేకలతో జైలంతా దద్దరిల్లిపోయింది. అలారం బెల్

## దేశం ఏమయ్యేటట్టు ?

గణ గణా మోగింది. వార్డర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. సెల్‌లో వాళ్ళంతా కేకలు పెట్టుకుంటూ "నువ్వు ఫేసిస్టువి" అంటే "నువ్వు ఫేసిస్టువి" అని చేతులు చేతులు కలుపుకున్నారు.

రామారావు బిక్క మొహంవేసి, ఆ దృశ్యాన్ని చూడలేక ఆ మోత భరించలేక, కళ్ళుమూసుకొని, చెవులుమూసుకున్నాడు.

అతనికి అంతా అయోమయంగా వుంది. దేశంలోని రాజకీయ పార్టీలు యీ విధంగా వుంటే దేశం ఏమయ్యేటట్టో అతనికి బోధపడలేదు. విచారంగా జైలువరండాలో నడుస్తుంటే ఒక వ్యక్తి యిలా అడిగాడు—

"ఎక్కడినించి వస్తున్నారు?"

"నెం 24."

"వాళ్ళేమన్నా కలిసేటట్టున్నారా?"

"లేదు !"

"బలే ! హిందూదేశం హిందువులది. వీళ్ళంతా మహమ్మదీయులకు దేశాన్ని అమ్మాలని చూస్తున్నారు."

"తమ రెవరు?"

"హిందూమహాసభ వాళ్ళం."

రామారావు మాట్లాడలేదు. అతడు "అఖండ హిందూస్తాన్" "అఖండ హిందూస్తాన్" అని కేకలు వేస్తూపోయాడు.

## దేశం ఏమయ్యేటట్టు ?

రామారావు రెండడుగులు వేసేసరికి మరొక వ్యక్తి వచ్చాడు.

"ఏదో తమరు హిందూ మహాసభవారితో మాట్లాడు తున్నారే!" అన్నాడు.

"అవును."

"ఏమంటున్నారు?"

"నెం 24 సంగతి అడిగాడు."

"నాకు తెలుసు. మొదటినుంచి మేం అనుమానిస్తూనే వున్నాం. వాళ్ళంతా సమయంవచ్చేసరికి ఒక్కటే అవుతారు. వాళ్ళంతా హిందువులే ! హిందూరాజ్యం స్థాపించడానికి ప్రయత్నిస్తున్నారు!!"

"తమ రెవరు?"

"ముస్లిం లీగ్"

"ఓహో !"

"పాకీస్తాన్, పాకీస్తాన్, పాకిస్తాన్,"అని కేకలు వేసుకుంటూ అతను వెళ్ళిపోయాడు.

రామారావు వుక్కిరిబిక్కిరి అయ్యాడు. పిచ్చిఆసుపత్రిలో అడుగు పెట్టాననుకున్నాడు. జైలు గేటుదాటి బైట అడుగు పెట్టేటప్పటికి' "బర్మామీద బాంబులు" "జపాను విజయాలు "బర్మామీద బాంబులు" "జపాను విజయాలు" అని

## దేశం ఏమయ్యేటట్టు ?

పేపర్లు అమ్ముకునే పిల్లలు కేకలు వినిపించినై. ఇక రామా రావుకి ఒక్క అడుగ్కూడా ముందుకు పడలేదు.

మరొక వ్యక్తి నెమ్మదిగా అతన్ని సమీపించాడు. బిళ్ల గోచీ పెట్టాడు. లాల్చీతొడిగాడు. జరీఅంచు కండువా వేశాడు నెమ్మదిగా రామారావు దగ్గరకు వచ్చి "ఏమన్నా?" అన్నాడు.

రామారావు వులిక్కి పడ్డాడు.

"మన సంగతి ఏమన్నా తేలిందా, అన్నా" అని అడిగాడు నూతన వ్యక్తి.

" ఏం సంగతి ? "

" ఆంధ్రరాష్ట్రం? "

రామారావు తల గిర్రున తిరిగింది. ఆ వ్యక్తిని చూడలేక పోయాడు. సహించలేక పోయాడు. ముందుకి చూశాడు. అంధకారం. ఇదివరకు సాధారణంగా అతనికి మూడు ప్రశ్నలు తడుతుండేవి. ఇప్పుడు ఒక్కటే ప్రశ్న—మూడుసార్లుతట్టింది.

దేశం ఏమయ్యేటట్టు ?

దేశం ఏమయ్యేటట్టు ? ?

దేశం ఏమయ్యేటట్టు ? ? ?

జపాన్ బర్మాని ఆక్రమించుకోక ముందూ, కమ్యూనిస్టు పార్టీ ఇది ప్రజా యుద్ధ మనేవిషయం గ్రహించకముందూ వ్రాసిన కథ ఇది.